క్లుప్తంగా

పాత్రికేయుడు కుటుంబానికి వైఎస్సార్ బీమా అందజేత



దుర్గి: అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన ఎల్రక్టానిక్ మీడియా పాత్రికేయుడు కోపూరి రఘుచంద్ర కుటుంబానికి ప్రభుత్వం అందజేసిన రూ.లక్ష నగదును మార్కెట్ యార్డు చైర్మన్ వెలిదండి గోపాల్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసులోనే మృతిచెందిన రఘు కుటుంబానికి సంతాపం తెలియజేసి మృతుని భార్య నాగమణికి రూ.10వేల నగదు రూపంలో అందచేసి రూ.90,000 బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాయపాటి మాణిక్యం వెల్ఫేర్ అసిస్టెంట్ సుజాత, ఇంజనీర్ అసిస్టెంట్ వాసు నాయక్, వలంటీర్ శేషగిరి, పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాచర్ల ఎంపీడీవో కార్యాలయంలో ఆడిట్



వెల్దుర్తి: మాచర్ల పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో 2022–23 సంవత్సరానికి గాను ఆడిట్ నిర్వహించినట్లు పల్నాడు జిల్లా సహాయ ఆడిట్ అధికారి షేక్ మస్తాన్ షరీఫ్ మంగళవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాచర్ల, వెల్దుర్తి మండలాలకు సంబంధించి 2022–23 సంవత్సరానికి ఆడిట్‌లో సమర్పించాల్సిన రికార్డులు అన్ని రకాల డిమాండ్, కలెక్షన్, బ్యాలెన్స్, లే అవుట్, బిల్డింగ్ ప్లాన్, పంచాయతీల ఆస్తుల వివరాలు, జమ ఖర్చులు విధి విధానాలు తెలపాలన్నారు. మున్సిపాలిటీల తరహాలో ఇక నుంచి పంచాయతీల్లోను ముందస్తు ఆడిట్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు డి. ప్రసాద్, కోటేశ్వరరావు, ఆడిటర్లు సీహెచ్ సుధాకర్, శ్రీనునాయక్, పంచాయతీ కార్యదర్శులు తదితరులున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని వైరు దొంగిలించిన దుండగులు

పిడుగురాళ్ల: పంట పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించిన ఘటన మండలంలోని చెన్నాయిపాలెం గ్రామంలో జరిగింది. ఘటనకు సంబంధించి ఎస్ఐ షేక్ రబ్బానీ ఖాన్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పలువురు రైతులకు చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైరును రాత్రి సమయాల్లో కొందరు దుండగులు దొంగతనాలకు పాల్పడున్నారని గ్రామానికి చెందిన ఏసుపాదంతోపాటు మరో నలుగురు రైతులు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ పఠాన్ రబ్బానీ ఖాన్ తెలిపారు.

కూలిన మట్టిమిద్దె



మాచర్ల రూరల్: గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మట్టిమిద్దె కూలిన ఘటన మండలంలోని కంభంపాడు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గొర్రె వీరయ్యకు చెందిన మట్టిమిద్దె దూలాలు నానిపోయి మెత్తబడి విరిగిపోవటంతో పై కప్పు మట్టిమిద్దె ఒక్కసారిగా కుప్పకూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవటంతో ప్రాణనష్టం జరగలేదు. కొద్దిపాటి వంట సామాను దెబ్బతిన్నది. ఈ మేరకు వీఆర్ఓ, పంచాయతీ కార్యదర్శి ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

శ్రీ సంతాన సుబ్రహ్మణేశ్వర స్వామికి శతకలశాభిషేకం



పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులోని నాగులగుడి దేవస్థానం నందు మంగళవారం షష్ఠి సందర్భంగా శ్రీ సంతాన సుబ్రహ్మణేశ్వర స్వామికి అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనం కల్పించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని స్వామివారిని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

జ్ఞానమహర్షి సర్వేపల్లి రాధాకృష్ణన్



డాక్టర్ సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



రాధాకృష్ణుడు, గోపికల వేషధారణలో విద్యార్థులు

విజయపురిసౌత్: జ్ఞానమహర్షి సర్వేపల్లి రాధాకృష్ణన్ అని ఏపీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వైఎస్ఎస్ చౌదరి అన్నారు. మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భారతదేశ తొలి రాష్ట్రపతి, భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజునే మనము ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించుకుంటామన్నారు. అజ్ఞాన పొరలను తొలగించి, మనలో జ్ఞాన దీప్తిని వెలిగించేది గురువేనన్నారు. ఆయన విద్యార్థులకు టీచర్‌లకు మధ్య ఉన్న అనుబంధాన్ని తెలియపరుస్తూ టీచర్ యొక్క గొప్పతనాన్ని వివరించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కళాశాల పూర్వ విద్యార్థి, చార్టెర్డ్ అకౌంటెంట్ రమణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్ వాడకాన్ని తగ్గించి పుస్తక పఠనం పట్ల దృష్టి సారించాలని కోరారు. తరువాత కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీలో గత ఏడాది ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు ఆయన నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ షేక్ మహమ్మద్ బాషా, మాధవీలత, సుధాకర్, డాక్టర్ ఉదయ్‌కుమార్, మీరావలి, గంగాధర్, వినయ్ బాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సెయింట్ మార్టిన్స్ స్కూల్‌లో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవం



ఏలియంపేట కాలనీ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు నాగేశ్వరరావుకు సన్మానం

కారెంపూడిలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

కారెంపూడి: అక్షరాభ్యాసం చేయించి భావి తరాలకు తరగతి గదిలోనే బంగారు భవిష్యత్తుకు బాటలు వేసే మహత్తర శక్తి ఉపాధ్యాయులదని అలాంటి గురువులను ఎల్లవేళలా గౌరవించుకోవడం మన సనాతన సంప్రదాయమని స్థానిక ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ కె.ఏడుకొండలు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎస్‌బీఐ అధికారులు, ఉద్యోగులు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలు బహూకరించారు. అలాగే మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలు, కళాశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు భారత తొలి రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. సర్వేపల్లి చిత్రపటానికి పూల మాలలు వేసి కేక్ కట్ చేసి గురు పూజోత్సవం నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు తమకు విద్య నేర్పుతున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. వర్షం కారణంగా బహిరంగ వేడుకలు నిర్వహించలేక పోయినా తరగతి గదుల్లోనే గురువులను విద్యార్థులు పూలుజల్లి పూలమాలలు వేసి వారి పాదాలకు నమస్కారం చేశారు. సమర్థ విద్యాబోధన చేస్తూ తమ బంగారు భవిష్యత్తు కోసం తపించే ఉపాధ్యాయులను విద్యార్థులు సన్మానించారు.

గురుకుల పాఠశాల, మోడల్ స్కూలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం, ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల పాఠశాలలు, జిల్లా పరిషత్తు, మండల ప్రజా పరిషత్తు పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. విద్యార్థులు ఉపాధ్యాయులను స్తుతిస్తూ పాటలు పాడారు. ఉపాధ్యాయులు కూడా రోజంతా ఉల్లాసంగా గడిపారు.

వైభవంగా ఉపాధ్యాయ దినోత్సవం కృష్ణాష్టమి వేడుకలు

వెల్దుర్తి: మాచర్ల పట్టణంలోని కృష్ణవేణి స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం, ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ఎం.హనుమంతరావు తెలిపారు. ముందుగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ అన్ని వృత్తులలో ఉపాధ్యాయ వృత్తి గౌరవించదగిందన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజు జరపటానికి కొందరు శిష్యులు వచ్చినప్పుడు సర్వేపల్లి నా పుట్టినరోజును వేడుకగా జరిపే బదులు ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహిస్తే ఎంతో గర్విస్తానని చెప్పారన్నారు. ఉపాధ్యాయ వృత్తిపట్ల తన ప్రేమను చాటారన్నారు. అప్పటి నుంచి సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజును భారతదేశంలో సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నారన్నారు. అనంతరం కృష్ణాష్టమి వేడుకలలో చిన్నారులు రాధాకృష్ణ గోపికల వేషధారణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం చూపరులను ఎంతో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన సర్వేపల్లి

దుర్గి: మండల పరిధిలోని ఆత్మకూరు జంక్షన్ సెయింట్ మార్టిన్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పాఠశాల ఉపాధ్యాయురాలు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన రాధాకృష్ణన్ జీవితం ప్రతి ఒక్క ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అదే విధంగా ప్రతి విద్యార్థి గురువుల పట్ల విధేయులై సత్ప్రవర్తన కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బెంజిమెన్, కరస్పాండెంట్ రాయపరెడ్డి, హెచ్ఎం రేణుక పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చౌదరి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న బ్యాంకు అధికారులు

గురువులను గౌరవించడం మన సంప్రదాయం

దాచేపల్లి : విద్యను అందించే గురువులను గౌరవించాలని ఎంఈవో పినాకపాణి అన్నారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు మంగళవారం జరిగాయి. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దాచేపల్లిలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎంఈవో పినాకపాణి మాట్లాడుతూ గురువు అందించే అక్షరజ్ఞానంతో ప్రపంచాన్ని జయించవచ్చునన్నారు. శాస్త్రవేత్తలైన, రాజకీయనేతలైన గురువు దగ్గర విద్య నేర్చుకుని ఉన్నతమైన స్థానాల్లో ఉన్నవారేనని, నేటితరం విద్యార్థులు గురువులు బోధిస్తున్న విద్యను క్రమశిక్షణతో అభ్యసించి ఉన్నతమైన స్థానాల్లో ఉండాలని ఆయన కోరారు. ఏలియంపేట కాలనీ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వట్టిపు నాగేశ్వరరావు, ఉపాధ్యాయురాలు పద్మావతిని నడికుడి ఎస్‌బీఐ మేనేజర్ వై. చిన్న కృష్ణయ్య సన్మానించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు.

గులాబి పురుగును సకాలంలో నివారించాలి

కారెంపూడి: పత్తిలో గులాబి రంగు పురుగును తొలి దశలోనే గుర్తించి తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా పంట నష్టాన్ని నివారించవచ్చని పిడుగురాళ్ల ఏడీఏ బి.శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. మండలంలోని పెదకొదమగుండ్ల గ్రామంలో జాగృతి ప్రాజెక్టులో భాగంగా ఎల్‌డీసీ, బేయర్ కంపెనీలు గులాబి రంగు పురుగు నివారణపై మంగళవారం నిర్వహించిన రైతు సదస్సులో ఏడీఏ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సదస్సులో పాల్గొన్న రైతులకు లింగాకర్షక బుట్టలను ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, ఏఓ బి.యలమందారెడ్డి చేతుల మీదగా ఉచితంగా పంపిణీ చేశారు. సదస్సులో ఏడీఏ మాట్లాడుతూ జనవరి నెల తర్వాత పత్తి పంట కాలాన్ని నీరుపెట్టి ఎరువులు వేసి పొడిగించవద్దని దీనివల్ల గులాబి రంగు ఉధృతి పెరిగి దాని జాడలు భూమిలో అలాగే ఉండిపోతాయన్నారు. భూమిలో పురుగు ఆనవాళ్లను నిర్మూలించేందుకు వేసవిలో లోతు దుక్కులు దున్నుకోవడం ద్వారా దాని ఆనవాళ్లను అంతం చేయవచ్చన్నారు. పంట వేసిన 45 రోజుల నుండి పత్తి పైరులో గులాబి రంగు పురుగు ఉనికి ఉందేమోనని నిశితంగా గమనించాల్సి ఉంటుందన్నారు. పైరులో పది శాతం గుడ్డి పూలు కాని లేదా పురుగు ఆశించిన కాయలు కాని కనిపిస్తే పురుగు జాడ ఉందని భావించాలని, లేదా లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకుని వరుసగా మూడు రోజులు బుట్టలలో 8కి తగ్గకుండా తల్లి రెక్కల పురుగులను గమనిస్తే వెంటనే సస్యరక్షణ చర్యలు ప్రారంభించాలన్నారు. తొలి దశలో సస్యరక్షణకు ప్రొఫెనోఫాస్ లేదా క్వినాల్‌ఫాస్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని లేదా క్లోరిపైరిఫాస్ అయితే 2.5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని ఇమామెక్టిన్ బెంజోఏట్ 0.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పంట చివరి దశలో అయితే క్లోరోపైరిఫాస్ మరియు సైపర్‌మైత్రిన్ లేదా ప్రొఫెనోఫాస్ మరియు సైపర్‌మైత్రిన్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని ఏడీఏ సూచించారు. నిర్వాహక సంస్థల ప్రతినిధులు యు.ఉపేంద్రరెడ్డి, గంగాధర, గ్రామ సర్పంచ్ మాదాసు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి అభినందనలు



కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ఉపాధ్యాయురాలు మార్తమ్మ



జిల్లా కలెక్టర్ చేతులమీదుగా జిల్లా స్థాయి అవార్డును అందుకుంటున్న వెంకటరెడ్డి

దుర్గి: దుర్గి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్న కందుకూరి మార్తమ్మ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ లోతేటి శివశంకర్ చేతుల మీదుగా అవార్డు స్వీకరించిన సందర్భంగా స్థానిక పాఠశాలలో తోటి ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

జిల్లా స్థాయి అవార్డుకు గురజాల ఉపాధ్యాయుడు

గురజాల : మండలంలోని మాడుగుల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న నెమలిదిన్నె వెంకటరెడ్డి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డును మంగళవారం అందుకున్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. అవార్డు గ్రహీత నెమలిదిన్నె వెంకటరెడ్డి మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

ఉత్తమ హెడ్‌మాస్టర్‌గా నాగేశ్వరరావు

పిడుగురాళ్ల: పట్టణంలోని లెనిన్ నగర్ హైస్కూల్ నందు పల్నాడు జిల్లా స్థాయిలో ఉత్తమ హెడ్‌మాస్టర్‌గా అవార్డు అందుకున్న ఎస్. నాగేశ్వరరావును ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సన్మానించారు. కౌన్సిలర్లు షేక్ జానీ, దేవళ్ల నాగరాజు, ఉప్పు వెంకటేశ్వర్లు, విద్యా కమిటీ చైర్మన్ ఇర్లా గురవయ్య, 33వ వార్డు కన్వీనర్ కందులూరి శేషయ్యలు ఉత్తమ హెడ్ మాస్టర్ నాగేశ్వరరావును సన్మానించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత నాగేశ్వరరావు మాట్లాడుతూ తనకు ఈ అవార్డు రావటానికి కృషి చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థుల సహకారమేనని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తన్నీరు బాలు, షేక్ మాభుసుభాని, ఓర్సు మోహన్, ఉపాధ్యాయులు నరమాల ఏడుకొండలు తదితరులు ఉన్నారు.



ఉత్తమ హెడ్‌మాస్టర్ ఎస్. నాగేశ్వరరావును సన్మానిస్తున్న కౌన్సిలర్లు, విద్యా కమిటీ చైర్మన్‌లు

పాస్టర్లందరూ ఐక్యంగా ఉండాలి

వెల్దుర్తి: మాచర్ల నియోజకవర్గంలోని పాస్టర్లందరూ ఐక్యంగా ఉండాలని ఫెలోషిప్ అధ్యక్షులు మేడి యాకోబు అన్నారు. మంగళవారం మాచర్ల పట్టణంలోని చర్చిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సేవకులందరూ ఐక్యత కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్క పాస్టర్ ఐక్యంగా ఉండి తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వివిధ చర్చిలలో ఏమైనా ఇబ్బందులున్నా సంఘం దృష్టికి తీసుకురావాలన్నారు. అందరూ కలిసి ఐక్యంగా ఉంటేనే సమస్యల పరిష్కారానికి అవకాశముంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సెవెంత్ డే అడ్వెంటిస్టు పాస్టర్ రమేష్, ఉపాధ్యక్షులు జొన్నలగడ్డ దాసు, సెక్రటరీ స్పర్జన్ కుమార్, ట్రెజరర్ బొనిగె పీటర్ పాల్, జాయింట్ సెక్రటరీ కుక్కమూడి వెంకయ్య, పట్టణ అధ్యక్షుడు మాచర్ల రవిబాబు, కుక్కమూడి యోహాను, కరుణాకర్, ఆదిరాల యేడి ప్రసాద్ పాస్టర్లు పాల్గొన్నారు.

మండలంలో పర్యటించిన ఉద్యాన శాఖ అధికారులు



మాచవరం: మండలంలోని పిన్నెల్లి గ్రామంలో పొలాల్లోని పంటలను ఉద్యానవన శాఖ అధికారి వై.మోహన్ సందర్శించారు. ఈ సందర్భంగా వై.మోహన్ మాట్లాడుతూ గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు మిరప నాట్లను విరివిగా వేయటం జరుగుతుందన్నారు. రైతులు నర్సరీలో పెంచిన చీడపీడలు లేనటువంటి నారును తమ పొలంలో నాటుకోవాలని తెలిపారు. అదే విధంగా మిరప పంటకు పశువుల ఎరువు, సేంద్రియ ఎరువు, జీవ ఎరువుల వినియోగాన్ని పెంచి, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని రైతులకు సూచించారు. అలాగే పంట వేసిన ప్రతి రైతు సంబంధిత ఆర్‌బీకేలోని సహాయకులతో పంట నమోదు చేయించి, ఈ కేవైసీ చేయవలసి ఉంటుందని, పంట నమోదు చేసిన ప్రతి రైతుకు ఉచిత పంటల బీమా పథకం వర్తించటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నన్నె ఐదా, వ్యవసాయ శాఖ సిబ్బంది కె.అఖిల్, వై. ప్రభాకర్‌రెడ్డి, గ్రామ రైతులుపాల్గొన్నారు.

రూ. 3,497 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి

అభివృద్ధి చేసింది కాసు మహేష్‌రెడ్డి
కొమ్మినేని

గురజాల : నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రూ.3,497 కోట్లతో అభివృద్ధి చేసింది ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అని గుంటూరు రైల్వే బోర్డు మెంబర్ కొమ్మినేని రవిశంకర్, పట్టణ కన్వీనర్ కుక్కమూడి అన్నారావులు అన్నారు. స్థానిక ఆర్ అండ్ బి బంగ్లాలో జనసేన నాయకులు గురజాల అభివృద్ధిపై చర్చకు పిలుపునివ్వగా వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం ఉదయం పది గంటలకు పాల్గొన్నారు. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు అభివృద్ధి జరగలేదని జరిగిన అభివృద్ధి మీ కళ్లకు కనిపించడం లేదా అని ఆరోపణలు చేసుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులపై మాట్లాడారు.

నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు ఇలా...

రూ. 500 కోట్లతో మెడికల్ కళాశాల , 600 పడకల వైద్యశాల నిర్మాణం. రూ. 218 కోట్లతో 57 గ్రామాల్లో ప్రతి ఇంటికి నీటి పైపు లైన్ ఏర్పాటు. రూ.82 కోట్లతో నాడు–నేడు పథకం ద్వారా 180 ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి మౌలిక వసతులు.



అభివృద్ధిపై చర్చలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ, జనసేన నాయకులు

రూ. 394 కోట్లతో మాచర్ల–నడికూడి హైవే ఏర్పాటు. రూ.409 కోట్లతో 63 కాలనీల్లో 22 వేల మందికి ఇంటి నివేశన స్థలాలు మంజూరు. రూ.113 కోట్ల నిధులతో సచివాలయ వ్యవస్థతో పాటు ఆర్బీకే సెంటర్‌లు, సీసీ రోడ్ల నిర్మాణం. రూ.81 కోట్లతో ఆర్ అండ్ బీ రహదారుల మరమ్మతులు. రూ.3 కోట్లతో ఆటో నగర్ అభివృద్ధి, రూ.8 కోట్లతో రహదారులు వెడల్పు, గురజాలలోని దూబచెరువును రూ.3 కోట్లతో, పిడుగురాళ్లలోని చెరువును రూ.11 కోట్లతో ట్యాంక్ బండ్ తరహాలో రూపొందించిన ఘనత ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విప్ కుక్కమూడి అనిల్ కుమార్, బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి చల్లా కాశీబాబు, కౌన్సిలర్ నీలంరాజు, జక్కా సత్యనారాయణ, జక్కా రమణ, కనకం ఆదినారాయణ దత్తు, బండి శ్రీను, గోళ్ల సైదయ్య, తదితరులున్నారు.

రెంటచింతల ఉప సర్పంచ్‌గా పేర్ల చౌడమ్మ ఏకగ్రీవం

రెంటచింతల: రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజల ఆర్థికాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరం సమష్టిగా కృషి చేయాలని వైఎస్సార్ సీపీ మాజీ జిల్లా కార్యదర్శి, మాజీ సర్పంచ్ అల్లం ప్రతాప్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మంగళవారం ఎన్నికల అధికారి కె.నరేంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన రెంటచింతల ఉప సర్పంచ్ ఎన్నికకు మొత్తం 18 మంది వార్డు సభ్యులకు గాను 10 మంది హాజరు కాగా 7వ వార్డు సభ్యుడు పల్లెర్ల సత్యనారాయణ 6వ వార్డు సభ్యురాలు పేర్ల చౌడమ్మను ప్రతిపాదించగా అందరూ చేతులెత్తి ఆమోదం తెలిపారు. ఎన్నికల అధికారి నరేంద్రారెడ్డి, ఈవోపీఆర్డీ రామచంద్రరావు చౌడమ్మచే ప్రమాణస్వీకారం చేయించి ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని అందచేశారు. గ్రామ ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన పేర్ల చౌడమ్మను వైఎస్సార్ సీపీ మాజీ కార్యదర్శి, మాజీ సర్పంచ్ అల్లం ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, దుర్గి మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఆదూరి ఇన్నారెడ్డి, పార్టీ నాయకులు దుశ్శాలువతో, పూలమాలలతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు అందించి పార్టీ అభివృద్ధికి కృషి చేసి గ్రామస్తుల మన్ననలను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూజల పుష్పావతి రామయ్య, కార్యదర్శి జి.అనంత కోటేశ్వరరావు, పార్టీ నాయకులు శ్యామల రవి కిశోర్‌రెడ్డి, అల్లం ఇన్నారెడ్డి, తుమ్మా పాపిరెడ్డి, గాలి ప్రతాప్‌రెడ్డి, పేర్ల ముత్తయ్య, గొట్టం నాసర్‌రెడ్డి, కంది సందీప్‌రెడ్డి, గాదె కిరీటిరెడ్డి, ఏరువ ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.



రెంటచింతల ఉప సర్పంచ్ పేర్ల చౌడమ్మను సన్మానిస్తున్న దృశ్యం

డప్పు చర్మకారుల జీవితాలలో వెలుగు నింపిన సీఎం జగన్


జే జేలు పలుకుతున్న కళాకారులు

వెల్దుర్తి: రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఎస్సీ, ఎస్టీలకు ఎంతో మేలు చేయగా ఆయన తరువాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గానికి చెందిన ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నాలుగు సంవత్సరాలలో చర్మ, డప్పు కళాకారులు వేలాది మందికి రూ. 3వేలు పింఛన్ చేశారని డప్పు, చర్మకారుల జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు జెట్టిపాలెం వెంకటేష్ జాంబవరాజు అన్నారు. మంగళవారం పెన్షనర్స్ భవనంలో నిర్వహించిన డప్పు కళాకారుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం ఎస్సీలకు మేలు చేస్తామని చెప్పి అన్ని వర్గాలను ఉపయోగించుకొని ఉత్తుత్తి జీఓ ఇచ్చి చేతులు దులుపుకుందని, కానీ అందుకు భిన్నంగా సీఎం జగన్ మూడు విడతలుగా వేలాది మందికి న్యాయం చేశారన్నారు. అందులో భాగంగానే మూడవ విడత మాచర్ల నియోజకవర్గంలో ప్రభుత్వ విప్ పీఆర్కే నేతృత్వంలో పట్టణం, ఐదు మండలాలో 100 మంది పేదలైన చర్మ, డప్పు కళాకారులకు పింఛన్ మంజూరు కావటం ఎంతో హర్షణీయమన్నారు. ఈ విధంగా ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకుంటున్న వైఎస్సార్ కుటుంబానికి ఎస్సీలంతా జే జేలు పలికి, నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు సిద్ధం కావాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బూడిద లక్ష్మయ్య, రమావత్ మాంగుబాయి, పేరువాల పద్మ, వడితె తిరుపతినాయక్, కంభంపాటి దానం, శాంతిబాయి, కోళ్ళ పేతురు, ఆరుముళ్ళ వెంకయ్య, గుంజర మరియదాసు, ఆలేటి చిన ఏసోబు, ఆదిరాల సుందరరావు, ఆలేటి దానియేలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డప్పు, చర్మకారుల జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు జెట్టిపాలెం వెంకటేష్

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి



ఏవో బోయపాటి

రెంటచింతల: మండలంలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలు తగ్గిన వెంటనే వ్యవసాయ అధికారుల సూచనల మేరకు పంట పొలాల్లో నిలిచిన వర్షపు మురుగునీరు తొలగించి మొక్కలు ఎర్రబడకుండా, ఎండిపోకుండా పోషకాలను అందించాలని ఏవో బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పత్తి పంటను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు తెగుళ్ల నివారణకు మందులను పిచికారీ చేసుకోవాలన్నా రు. రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకానికి ఆధార్ నెంబర్ అనుసంధానం చేసుకోవాలని సూచించారు. భూసార పరీక్షాపత్రాల ఆధారంగా రైతులు ఎరువులను వాడుకోవాలన్నారు. రైతులు ఇష్టానుసారంగా రసాయనిక ఎరువులను ఎక్కువ మోతాదులో వాడినట్లు అయితే పెట్టుబడి పెరుగుతుందన్నారు. ఎరువుల డీలర్లు ఈ పాస్ యంత్రాల ద్వారానే రైతులకు ఎరువులు పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వం నిబంధనల మేరకే రైతులకు డీలర్లు ఎరువులపై సబ్సిడీ అందిస్తూ విక్రయించేలా చర్యలు తీసుకున్నామన్నారు. అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చినట్లు అయితే అటువంటి డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కందిసాగుకు వాతావరణం అనుకూలం

ఈ కేవైసీ గడువు సెప్టెంబర్15

దుర్గి: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కందిసాగుకు అనుకూల వాతావరణం ఉందని రైతులు కంది పంట సాగు విస్తీర్ణం పెంచుకోవాలని వ్యవసాయాధికారి వై.అమీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సిబ్బంది సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఏర్పాటు చేసిన ఆర్‌బీకేలను మరింత పటిష్టంగా ఉంచేందుకు స్థానిక సిబ్బంది సహాయంతో ఈ క్రాప్ బుకింగ్, పీఎం కిసాన్, ల్యాండ్ సీడింగ్ గురించి, ఈకేవైసీపై పలు సందేహాలను నివృత్తి చేశారు. సెప్టెంబర్ 15వ తేదీలోపు పైన తెలిపిన అన్ని వివరాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా పత్తి పంట ఏడు వేలు, కంది 3260, ఎండు మిరప 1170, వరి 20, ఇతర పంటలు 125 ఎకరాలలో మొత్తం 10,670 ఎకరాలలో సాగు చేసినట్లు తెలిపారు. రైతులు ఆర్‌బీకేలో ఉన్న కాంప్లెక్స్ ఎరువులను ఉపయోగించుకోవాలన్నారు. దుర్గి ఆర్‌బీకేలో నానో యూరియా అందుబాటులో ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో వీఏఏలు, వీహెచ్ఏలు, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిర్మూలిద్దాం

అమరావతి: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని వాటిని నిర్మూలించి, బాలల హక్కులు కాపాడటం ప్రతిఒక్కరి బాధ్యతని గుడ్‌షెఫర్డ్ సంస్థ సుపీరియర్ సిస్టర్ విన్నరసి అన్నారు. మంగళవారం గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మీటింగ్ హాల్‌లో బాల్య వివాహాలు బాలల హక్కులపై అవగాహన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సంస్థ కో–ఆర్డినేటర్ లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. సిస్టర్ విన్నరసి మాట్లాడుతూ చైల్డ్‌లైన్ 1098 గురించి వివరించారు. ప్రభుత్వం అన్ని విధాలుగా చదువుకోవడానికి అవకాశాలు కల్పిస్తుందని, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆడపిల్లల కోసం ప్రత్యేకంగా స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ స్కిల్ డెవలప్మెంట్‌లను సంస్థ నిర్వహిస్తుందని తెలిపారు. సంస్థ సిబ్బంది బత్తుల బాబు పవన్, మరియమ్మ, బ్యూలా, పలువురు మహిళలు పాల్గొన్నారు